

# పుస్తక పరిచయం




*Published by:*
**Lipi Publications**
**Gandhi Nagar**
**Hyderabad – 500 080**
**Phone: 040-761 2244**
**Cell: 98490 22344**

**"ప్రయాణించే సమయం ఉంటే ఏ ప్రదేశమైనా చేరువలోనే ఉన్నట్లనిపిస్తుంది"** అనే నానుడి ఎక్కువగా ప్రయాణాలు చేసేవారికి బాగా వర్తిస్తుంది. తెలుగులో యాత్రాసాహిత్యం చాలా తక్కువ అనే విషయం ఎవరూ కాదనలేని సత్యం. యాత్రాసాహిత్యాన్ని విజ్ఞాన, వినోద, వికాస పూరితంగా తీర్చి దిద్దాలంటే ప్రయాణించే వారి దృష్టి, చూసే ప్రదేశాల విశ్లేషణా ప్రత్యేకంగా ఉండాలి. వారు ప్రొఫెషనల్ రైటర్ కూడా ఐనప్పుడు ఆ ట్రావెలోగ్ పాఠకులందరినీ పదికాలాలు అలరిస్తుంది.తన ఏడవ ట్రావెలోగ్ ద్వారా మల్లాది వెంకటకృష్ణమూర్తిగారు ఈ విషయాన్ని మరోసారి ఋజువుచేశారు. క్రిందటి సంవత్సరం పదకొండు రోజులపాటు తూర్పు ఐరోపాదేశాలైన తూర్పు జెర్మనీ, చెక్ రిపబ్లిక్, స్లోవేకియా, ఆస్ట్రియా, హంగరీ, పోలాండ్ దేశాలని చుట్టివచ్చిన ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాదిగారి మరో విశిష్ట రచన ఈ 'ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్". మల్లాదిగారి రచన అనగానే సరళమైన శైలిలో, ఏ విషయాన్నైనా అతి సులువుగా, అందంగా, ఆసక్తికరంగా అందిస్తారని తెలుగుపాఠకులందరికీ తెలుసు. ఈ పుస్తకం కూడా మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకూ ఆపకుండా చదివింపచేస్తుంది. ఇంట్లో బయలుదేరిన వద్దనుంచి అంతర్జాతీయ విమానం ఎక్కేదాకా, ఆ తర్వాత తను చూసిన ప్రదేశాల గురించి, ఎదురైన వ్యక్తులు, సన్నివేశాలని అత్యంత విశదంగా పాఠకుడిని చేయి పట్టి తనతో తీసుకెళ్ళినట్లు వివరిస్తారీ పుస్తకంలో. అవసరమైన చోట్ల చారిత్రక వివరాలని అవసరమైనంత మేర ఇచ్చి పాఠకులకి విజ్ఞానాన్ని కూడా అందించడం ఈ పుస్తకం మరో ప్రత్యేకత. పోలెండ్ లోని ఔష్ విట్ కేంప్ లాంటి ప్రదేశాల వివరాలు వ్రాసేప్పుడు సమయోచితంగా చిన్న చిన్న కథలు కూడా చెప్పారు. ఆయా ప్రదేశాలు చూడాలనుకునే వారికి చక్కటి గైడ్‌లా ఉపయోగపడుతుంది పుస్తకం. ఇప్పటికే చూసేసిన వారికి కూడా భిన్నకోణంలో ఆయా ప్రదేశాలని ఎలా చూడొచ్చో తెలుస్తుంది. 200 పేజీల పుస్తకంలో 20 పేజీల వర్ణచిత్రాలు కూడా ఉన్నాయి. ఓ ఆత్మీయమైన మిత్రుడు పక్కన కూర్చుని ఆయా విశేషాలన్నింటినీ మనసు విప్పి మనతో పంచుకున్న అనుభూతిని కలిగిస్తుందీ ట్రావెలోగ్. ఆ కళ మల్లాదిగారికి మాత్రమే సొంతం అనడంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు.

**




**భరతనాట్య కళారంగంలో** విశేష ఖ్యాతి నార్జించిన నర్తకీమణి డా.పద్మా సుబ్రహ్మణ్యంగారి జీవిత చరిత్ర ఈ పుస్తకం. డా.పద్మా సుబ్రహ్మణ్యం గారు కేవలం భరతనాట్య కళాకారిణిగానే మిగిలిపోకుండా ఆ నాట్యరంగంలో విశేష పరిశోధనలు చేసి, అందులో ఎన్నో కొత్త ప్రయోగాలు చేశారు. సరికొత్త అంశాలు జోడించి భరతనాట్యానికి కొత్త సొగసులు అద్దారు. ఆలాంటి విశిష్టమైన కళాకారిణి జీవిత చరిత్రకు గ్రంధరూపం ఇవ్వడమంటే అందరికీ సాధ్యపడే పని కాదు. ఎందుకంటే ఒక కళాకారిణి జీవితంలోని అనుభవాలని, ప్రయోగాలని సరిగ్గా వర్ణించాలన్నా, విశ్లేషించాలన్నా మరో కళాకారిణికే సాధ్యమౌతుంది. ఐతే అలాంటి కళాకారిణి రచయిత్రికూడా ఐనప్పుడే ఆ కృషికి పరిణితి లభిస్తుంది. అంత పరిణితితో ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దిన చిన్నారి, కుమారి పి.శ్రుతకీర్తిని ఎంతైనా అభినందించాలి. హైదరాబాదులో ఏ ప్రతిష్టాత్మకమైన సాంస్కృతిక కార్యక్రమానికి వెళ్ళినా శ్రుతకీర్తి స్వరం వినిపిస్తుంది. తన మధుర గంభీర స్వరంతో ఎన్నో కార్యక్రమాలకి వ్యాఖ్యాతగా వ్యవహరించి ‘వ్యాఖ్యాన విపంచి‘గా పేరు పొందింది శ్రుతకీర్తి. భరతనాట్య కళాకారిణిగా, టి.వి.ప్రయోక్తగా, ప్రముఖ నాట్యకళాకారులను ఇంటర్వ్యూ చేసిన పాత్రికేయురాలిగా, అతిచిన్న వయసులోనే బహుముఖ ప్రజ్ఞత్వాన్ని ప్రదర్శిస్తున్న శ్రుతకీర్తి కలంనుంచి వెలువడింది ఈ పుస్తకం. ఈ జీవిత చరిత్రని కేవలం తేదీలు, సంఘటనలకి పరిమితం చేయకుండా డా.పద్మగారి కళా జీవితాన్ని విశ్లేషిస్తూ, ఆమె సాధించిన విజయాల వెనుకనున్న కృషిని వివరిస్తూ తనదైన శైలిలో ఈ పుస్తకాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దారు రచయిత్రి. భరతనాట్యంలో భంగిమలు అన్న భావనకు కాస్త విలక్షణమైన ‘కరణాలు‘ అనే భావనని వివరిస్తూ 108 కరణాల లక్షణాలని బొమ్మలతో సహా వివరించడం ఇంకొక విశేషం. అరుదైన ఛాయాచిత్రాలు ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణ. భవిష్యత్తులో శ్రుతకీర్తి కలం నుంచి మరిన్ని మంచి గ్రంధాలు రావాలని కౌముది మనసారా ఆశిస్తోంది.

***Published by :***
***Sarada***
***Sruthy Art Academy***
***#211, Range View Apartments***
***Rethi Bowli, Mehdipatnam***
***Hyderabad – 500 011***
***Email: sruthakirthy@yahoo.co.in***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**